కథ

# నయనతార

**- యలమర్తి అనూరాధ**

మంచుపైటను కప్పుకొన్న కొండల్ని, ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాన్ని, నిద్రపోతున్న పట్టణాన్ని, చీకటిలో వెలుగులా ఉన్న విద్యుత్ దీపాలను ముచ్చటగా ముందు చూడటం అలవాటయిన 'నయన' కు ప్రతి రోజు ఉషోదయం ఇలానే మొదలవుతుంది. అలా పది నిముషాలు ప్రకృతి ఒడిలో నాలుగు గంటల సమయంలో కరిగి అప్పుడు లోపలికి వచ్చి ధ్యానంలో కూర్చుంటుంది. ఆ ధ్యానం అనంతాన్ని సూక్ష్మరూపంలో దర్శించి. మనసును ప్రశాంత పరుచుకుంటుంది. ఆమెను ఆశీర్వదిస్తున్నట్లు కొండపైన శివాలయం నుంచి సుప్రభాతం ప్రారంభమవుతుంది. అది వింటూ వాకింగ్ కార్యక్రమాన్ని ముగిస్తుంది. అందమైన ముగ్గుతో ముంగిటిని అలరించటం ఆమెకు మొదటి హాబీ, అదయ్యాక దైనందిన కార్యక్రమంలో పడుతుంది.

అప్పుడు, ఆరు గంటలకు ఇంట్లో అందరికీ తెల్లవారుతుంది సందడి మొదలవుతుంది. సామానుల గలగలల శబ్దం వినబడుతుంది. "నయనా ! నీళ్ళు తోడేస్తున్నానమ్మా !" తల్లి సత్యవతి కేకకు "అలాగే అమ్మా!" అని బాత్రూంలో కట్టుకోవాల్సిన బట్టలు వేసుకొని వచ్చి అమ్మా ! ఈరోజు నేను కోర్టుకు వెళ్ళాలి. అమాయకురాలు అరుణను నా సాక్ష్యమే ఉరికంబంనుంచి కాపాడేది. నేను భయపడి వెళ్ళకపోతే రౌడీ రాంబాబు ఆగడాలకు అంతు ఉండదు" అంది.

"వెళ్ళిరా నయన ! నీ ప్రతి మంచి పనికీ భగవంతుడి ఆశీస్సులుంటాయి. సత్యం పలకటం అంటే పుణ్యం మూట కట్టుకోవటమే !"

"కొంచెం ఆలస్యమవుతుంది. కంగారు పడకు. అక్కడ దగ్గరలో ఉన్న కొంత మంది ఇళ్ళకు వెళ్ళి వాళ్ళను నేత్రదానంకి ఒప్పించే కార్యక్రమం పెట్టుకున్నాను. కనీసం ఒక పదిమందినయినా ఒప్పించాల్సిందే. నేనొక్కదాన్ని నా కళ్ళు చనిపోయాక దానం చేస్తానని ఊరుకోవటానికి మనసొప్పటం లేదు. అందుకే ఇలా ఎక్కడికి వెళితే అక్కడ ప్రయత్నిస్తా".

"నయనా ! నా బంగారు తల్లీ ! చీకటి క్రమ్ముకున్న గ్రుడ్డివారి జీవితాలకి వెలుగు ప్రసాదించటానికి నీ విలువైన కాలాన్ని ఇలా సద్వినియోగం చేస్తున్న నిన్ను దీవించాలని మనసు తపన పడుతున్నా మాటలు రావడం లేదే. నువ్విలా వందేళ్ళు హాయిగా బ్రతికి పదిమందికి సాయపడాలి" మౌనంగా ఆమెను దగ్గరకు తీసుకొని నుదిటి మీద ముద్దాడింది. ఆ ముద్దులో ఎన్నో భావాలు, మరెన్నో ఆశీర్వచనాలు.

"మా మంచి అమ్మ. అందరి అమ్మలులా అది చెయ్యకు, ఇది చెయ్యకు అనవు. ఇంకా ఇలా చెయ్యి. అలా చెయ్యి అని నన్ను మంచి వైపుకు నడిపిస్తావే. ఇలాంటి అమ్మ ఈలోకంలో నాకొక్కరికే ఉందని గర్వంగా చెప్పగలను" అంటూ అమ్మకి ముద్దిచ్చి స్నానానికెళ్ళింది.

రెడీ అయి బయలుదేరబోతుంటే పనిమనిషి కొడుకు కార్తీక్ ఎదురు వచ్చాడు అక్కా ! ఈరోజు పరీక్షలు ప్రారంభం. క్వార్టర్లీలో కంటే హాఫియర్లీలో ఇంకా ఎక్కువ తెచ్చుకోవాలని, పదోతరగతికి స్టేట్

ఫస్ట్ ఈ కార్తీక్ అని అనిపించుకోవటానికి బాగా ప్రయత్నం చేస్తున్నా! నువ్వు గురువయితే రాకేం చేస్తుందిలే. అది చెప్పటానికే వచ్చాను.

"కార్తిక్ ! అదీ అలా ఉండాలి. నీకో గమ్యం ఏర్పరుచుకొని దానిని సాధించాలనే తపనతో కృషి చేస్తే జీవితంలో ఎప్పుడూ ఉన్నత స్థాయిలోనే ఉంటావు. ఇదిగో ఈ వాచీ నిన్ననే కొన్నాను. తీసుకో ! పరీక్షల్లో టైము తెలుస్తుంది."

"వద్దక్కా ! నీ ప్రేమ చాలు !"

"పోరా ! అక్క ఇస్తుంటే వద్దనకూడదు. నాకు ఉన్నది నీకు పంచుతున్నాను." అంటూ అతని చేతికి కట్టింది. ఆమెలో సూర్యచంద్రులు కనిపించారు. ఒక్కక్షణం సూర్యునిలా వెలుగు కిరణాలను, చంద్రునిలా ప్రేమ కిరణాలను పంచటం అక్కకి చెల్లుతుంది అనుకొని చటుక్కున ఆమె పాదాలను తాకాడు.

"ఛ ! ఛ ! ఇదేమిటి ! లేలే ! పద వెళ్దాం, అమ్మా ! వెళ్ళొస్తా !" ఆమె కదిలింది.

"పెదవులకు సత్యము, గొంతునకు ప్రార్థన, నేత్రమునకు కరుణ, రూపమునకు నిటారుతనము, హస్తమునకు దానము, హృదయానికి ప్రేమ ఎంతో అవసరం' అని మహాత్మాగాంధీ చెప్పిన సూక్తిని తండ్రి ధర్మమూర్తి చదువుతూ ఉంటే ఆమె గమనం సమాజ సంక్షేమంవైపు సాగిపోయింది. ★

# బాల్యం దూరమై... బతుకు భారమై...

(52వ పేజీ తరువాయి)

ఉన్నాం. నేతలు. సంబందిత అధికారగణంలో పరిపూర్ణ కదలిక లేకపోవడం ఒక బలమైన హేతువుగా ఉందనే ఆరోపణలు సర్వేసర్వత్రా వినిపిస్తున్నాయి.

ఈ సమస్య నిర్మూలనకు బాలలపై ఆదారపడిన వారిని, బాలకార్మికులను ఎంపికచేసి రుణసహాయం ద్వారా కుటీరపరిశ్రమ లను నెలకొల్పి ఉపాధి చూపించాలి. మేధావులతో బాల కార్మికులకు వారి సంబంధితులకు విద్యపై సమగ్ర అవగాహనా సదసుస్సులు ఏర్పాటుచేయడం. స్వయంఉపాధి కల్పించు నూతన సంస్కరణలతో విధ్యావిధానాన్ని ప్రవేశపెట్టి సక్రమరీతిలో అమలు జరిగేలా చర్యలు గైకొనాలి. చట్టబద్ధమైన విధిగా 6-14 సం॥ల బాలలకు నిర్భంధ విద్యా విధానాన్ని అమలు జరిగేలా చూడాలి. ప్రభుత్వ సంస్కరణలు పధకాలు అన్ని ప్రాంతాల ప్రజలకు తెలిసేవిధంగా ప్రచారం జరిగి అమలుకు నోచుకునేలా చర్యలు గైకొనాలి. నేతలు, అధికారులు, చిత్తశుద్ధి, సేవాభవం, దృఢసంకల్పం వంటి మౌలికలక్షణాలతో మానసికంగా తయారై లక్ష్యాల దిశగాసాగాలి. బాల్యంపై అవగాహన, చదువుపై ఆసక్తికలిగే చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి. సామాజిక స్పృహ వ్యక్తిత్వ వికాసం పెంచేలా తర్ఫీదు నివ్వాలి. బాలకార్మిక వ్యవస్థ ఎంత దుర్భరమైందో, ప్రమాద భరితమో దేశభవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా ఎలామారుతుందో తెలిపే కళారూపాలను ఏర్పాటు చేసి ప్రదర్శనలద్వారా ప్రచారం జరపాలి. మీడియా, డాక్యుమెంటరీలు, ర్యాలీలు, వీధినాటికల ద్వారా స్ఫూర్తి తీసుకురావటంతోపాటు సర్వేలను నిర్వహించి ప్రభుత్వం చేపట్టే వివిధ ప్రాజెక్టులను సమర్ధవంతంగా పనిచేయడంలో తమవంతు కర్తవ్యంగా "నేను సైతం..." అంటూ ఎవరికివారు కదంకదిపి ముందుకురావాలి. ప్రభుత్వం అధికార, అనధికార వర్గాలు, స్వచ్ఛంద సేవాసంస్థలు, అన్నివర్గాలకు చెందిన వారు దీనిలో విలీనమై సమిష్టిగా నిలిచి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నట్లయితే బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించే అవకాశాలున్నాయి. ★